

# క్షణికం

**జయకాంత్**

**"విన్నారా?"** అంది పడగ్గది లైటు తీసేస్తూ లలితాంబ.

మంచంమీద పడుకున్న చలమయ్యకు నిద్ర పట్టేసినట్లుంది; ఉలకలేదు, పలకలేదు.

"ఎప్పుడూ బండనిద్రా, మీరూ........ ఆ గుర్నాధంగారి సుశీల నొప్పులు పడుతూందండీ!" అంది అతగాడి బుగ్గమీద ఒక పోటు పొడుస్తూ.

చలమయ్య తక్కున లేచి కూచుని "ఏవిఁటే వీఁటీ!" అన్నాడు.

"ఇన్నాళ్లూ నంగనాచిలా కప్పెట్టేడు. ఇక ఎలా దాస్తాడో చూద్దాం.... అవ్వ.... మా రోజుల్లో మేం ఎరగం. సిగ్గూ, లజ్జా ఉండద్దూ! రేపు నలుగురికీ మొహం ఎలా చూపిస్తాడంట? కేకరించి ఉఁయరూ?" అంది మంచంమీద కూర్చుంటూ.

*తప్పుతప్పే, ఎవరుచేసినా. ఏలాంటి పరిస్థితులలో చేశారు, అనివార్యమా కాదా అన్న విచక్షణ మాత్రం అవసరం. లేకపోతే మానవత్వమే అడుగంటే ప్రమాదం ఉంది, మరి.*

"పిదపకాలం! రేపు ఆ పిల్లముండయినా నలుగురిలో తలెత్తుకుని ఎలా తిరుగుతుందో చూద్దాంగా" అంటూ ఆమె దగ్గరికి జరిగాడు.

"అసాధ్యులండోయ్, తండ్రీ కూతుళ్లూ! రాత్రికి రాత్రి కనేసి ఏ కంప దొడ్లోనన్నా పారెయ్యకపోతే యీ చెవి కోసుకుంటా! అయినా మనకెందుకులెండి, ఒహాళ్ల గొడవ?" అని విక్రుతంగా ఒళ్లు విరుచుకుని పక్కమీదికి ఒరిగింది లలితాంబ.

• • •

అప్పటివరకూ గుండెలు బాదుకుంటూ

జుట్టు పీక్కుంటూ ఇల్లంతా సుడిగుండంలా తిరుగుతున్న గుర్నాధం ఒక్క క్షణం ఆగి, ఏం చెయ్యాలో అర్ధంగాక చూరువేపు చూశాడు. చూరు విరిగి తలమీద పడుతున్నట్లుంది. గిర్రున వెనక్కు తిరిగి బయటికి వచ్చాడు. లోపలి నుంచి సుశీల గావుకేక వినిపించింది. తక్కున ఆగిపోయాడు గుమ్మంలోనే.

"ఛీ..... పాడుముండ!" తుపుక్కున ఊశాడు.

"అయ్యో!.... అమ్మా!" అంది లోపలి నుంచి సుశీల.

తిన్నగా ఆమె మంచం దగ్గరికి వెళ్ళి "మళ్ళీ అరిచావో, గొంతు పిసికి గోడవతల పారేస్తాను" అని నిప్పులు కక్కాడు గుర్నాధం.

సుశీల కిక్కురు మనలేదు. గిలగిలా తన్నుకుంది. సాయంత్రం ఆరు గంటలనుంచి ప్రసవ వేదన అనుభవిస్తున్నది.

గుర్నాధం ఆ నరకంలో నిలబడలేక చరచరా వీధిలోకి వచ్చేశాడు.

'ఇదీ ఒకందుకు మంచిదే అయింది. నొప్పు లెక్కువై చస్తే చిక్కు వదిలిపోతుంది.' తన ఆలోచన ఎవరికయినా వినిపించిందేమోనని చుట్టూ తిరిగి చూశాడు. మసక వెన్నెల్లో కాస్త దూరంగా ఉన్న గోవిందరావు ఇల్లూ, చలమయ్యగారి మేడా ఆ గుడిసెలమధ్య ఫాదిరీ దొర గోరీల్లా కనిపించాయి.

గోవిందరావుకూ, తనకూ రాకపోకల్లేవు. చలమయ్యగారి కుటుంబం తరహాయే వేరు. ఇరుగు పొరుగునఉన్నవాళ్ళ గొడవలు వాళ్ళకు గిట్టవని వినికిడి. ఇక మిగిలిన వాళ్ళు కూలి నాలి చేసుకుని బతికే అలగాజనం. చొరవగా ఇంట్లోకి రారు. అందువల్లే తన రహస్యం బయటికి పొక్కలేదు. లేకపోతే తన కూతురు పెళ్ళికాకముందే కడుపు చేసుకుందని లోకం కోడై కూసేది!

చింతచెట్టుమీద నక్కి కూచున్న గుడ్లగూబ గట్టిగా ఘూత్కరించింది. ఆ ధాటికి అక్కడున్న గబ్బిలాలు కీచు కీచుమన్నాయి.

బహుశా తను కళ్ళుమూసుకుని పాలు తాగుతున్న పిల్లిలా భ్రమపడుతున్నానేమోనని పస్తాయించాడు. అథవా ఆవిషయం జాడగా తెలిసినా, అతన్ని నిలదీసి ఎవరూ అడగలేదు. చాటున నవ్వుకున్నారో, ఏమో! పోనీ, ప్రసవించిన తరువాత ఎక్కడ దాస్తాడని ధీమాగా ఉండవచ్చు.

"దండుముండ!" ఈసారి గట్టిగా వినబడేటట్లు తిట్టుకున్నాడు. తన గౌరవం గంగపాలు చేసింది. తనే స్వయంగా తెలుసుకునేవరకూ చెప్పలేదు. తెలుసుకున్న తరువాత తనేం చెయ్యలేకపోయాడు. దుప్పటి కప్పి జబ్బుతో ఉందని మంచంమీద పండబెట్టాడు.

అతని కాళ్ళు అప్రయత్నంగా నడుస్తున్నాయి. అప్పటివరకూ జీవితంతో సతమతమవుతున్న ప్రపంచం కాస్త కునుకు తీస్తున్నట్లుంది. అతన్ని చూడగానే మూలబజార్లో కుక్కలు భొయ్యిమన్నాయి. "ఈనాటికి నేను కొత్తగా కనిపించానన్నమాట. మా తాత ముత్తాతలు నా కంచం కడిగిన మెతుకులు తిని బతికార్రా,

# క్షణికం

తొత్తుకొడుకుల్లారా!" అని కసురుకుంటూ గుర్నాధం గబగబా నడిచి మోతేవారి మేడ మలుపు తిరిగాడు.

ఒకప్పుడు ఆ మేడలో డాక్టర్ కమలమ్మగారి ఆస్పత్రి ఉండేది. సుశీల పుట్టింది యీ ఆస్పత్రిలోనే. మొదట జన్మనక్షత్రం మంచిది కాదని, తల్లి గండాన పుట్టిందని అన్నారు. ఆరోజు అతని మొహంలో భయంచూసి రాజమ్మ జాలిగా నవ్వింది. గుర్నాధం శాంతి చేయించి, మనసులో పీకుతున్న అనుమానం దూరం చేసుకున్నాడు.


తల్లీ, బిడ్డా సురక్షితంగా ఇంటికి వచ్చారు. తనకు సంతానం కలగాలని నిత్యం కోరుకుంటున్న కోరిక ఫలించకపోయినా, ఆ పిల్ల అందచందాలు చూసి మురిసిపోయాడు. ముద్దుమాటలు విని మైమరిచాడు. తిరుపతికి తీసుకువెళ్లి తల వెంట్రుకలు ఇచ్చి వచ్చాడు.

వస్తున్నప్పుడు రాజమ్మ మెళ్ళో పసుపుకొమ్ము చూసి "మంగళసూత్రం ఏమైందే?" అనడిగాడు గుర్నాధం.

"నా కూతురు సౌభాగ్యవతి అయి నాలుగు కాలాలపాటు సుఖంగా జీవించాలని స్వామివారికి సమర్పించాను" అంది రాజమ్మ.

ఆనాటి ఆమె మాటలు తలుచుకొని వాపోయాడు గుర్నాధం. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ఆకాశంలోకి చూసి నిట్టూర్చాడు. నల్లని మబ్బులు వెక్కిరిస్తున్నట్లు కనిపించాయి. ఉమ్మగా ఉంది. అతని ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయి పోయింది.

సుశీల చదువుకుంటున్నప్పుడు, ఆమె తెలివితేటలు తెగ మెచ్చుకునేది రాజమ్మ. "నా కూతుర్ని బి. ఎ. వరకూ చదివించి మంచి సంబంధం తీసుకొచ్చి చెయ్యండి" అనేది.



తన్మయత్వం
చిత్రం—రావాడ కృష్ణ (ధవళేశ్వరం)

సుశీల స్కూలునుంచి రాగానే ఇంట్లో పనులన్నీ చేసేది. "ఎప్పుడూ మూలుగుతుంటావ్, నీకెందుకమ్మా యీ కష్టం! నేనున్నాగా, ఒక్క క్షణంలో పనులన్నీ తెముల్చుకొస్తా" అనేది ఆరిందాలా.

"చచ్చి స్వర్గాన ఉన్న మా అమ్మే పుట్టుకొచ్చింది నా కష్టాలు చూళ్ళేక" అని నిండాను లయ్యేది రాజమ్మ.

ఆమె కట్టుకున్న కోటలన్నీ కూలిపోయాయి. ఆ శిథిలాల మధ్య శిఖరంలా మిగిలిపోయాడు గుర్నాధం.

రోడ్డుకు కాస్త దూరంగా గుబురుగా పెరిగిన చెట్లవెనుక ఒంటరిగా ఉన్న డాబా పక్కన ఒక వ్యక్తి నిలబడి కిటికీలోంచి తొంగి చూస్తున్నాడు. లంజరికానికో, దొంగతనానికో! గుర్నాధం రాక చూసి పోలీసు అనుకొని లగూ తీశాడు.

ఆ లెక్కకువస్తే తనూ ఒక దొంగే నను కున్నాడు గుర్నాధం. రాజమ్మ నోరు కట్టుకొని పోగేసుకున్న డబ్బులు అలాగ్గా అపహరించుకుపోయేవాడు. సుశీల కూడా ఒకసారి అమ్మకు చెప్పకుండా చిల్లరడబ్బులు తీసుకెళ్లి రిబ్బన్లు కొనుక్కుంది. "భడవా, నువ్వూ నేర్చుకుంటున్నావ్" అని కసిరాడు గుర్నాధం.

"దానికీ ఆ తండ్రి బుద్ధులే అబ్బినయ్" అని చిటపటలాడింది రాజమ్మ.

సుశీల పద్నాలుగో ఏట పుష్పవతైంది. "వెంటనే మూడుముళ్ళూ వేయించండి" అంది రాజమ్మ. తను వినలేదు. కూతురు చక్కగా, చురుగ్గా చదువుకుంటున్నది. పెళ్లిచేసి దాని చదువు పాడుచెయ్యనన్నాడు.

రాజమ్మకు జబ్బువచ్చి మంచం ఎక్కింది. "నేనిక బతకను. సుశీల పెళ్ళి చూసిపోతాను" అని మొరపెట్టుకుంది.

"డాక్టర్ యీ ఇంజక్షనుతో తగ్గిపోతుందన్నాడు. ఎందుకలా కంగారుపడతావ్?" అన్నాడు.

చివరికి రాజమ్మ మాటే ఖాయమైంది. తన భార్య కోరిక నెరవేర్చలేకపోయాననే అని ఎంతో నొచ్చుకున్నాడు గుర్నాధం.

భార్య చనిపోయినతరువాత అతని ఆరోగ్యం చెడిపోయింది. తనూ మంచం ఎక్కాడు. "పక్షవాతం సూచనలు కనిపిస్తున్నాయి" అన్నాడు డాక్టర్. అప్పుడప్పుడు ఒక కాలు, ఒక చెయ్యి కదిలేదికాదు. మాటకూడా సరిగ్గా వచ్చేదికాదు.

సుశీల చదువు మానుకుంది. కంటికి రెప్పలా చూసుకునేది గుర్నాధాన్ని.

గుర్నాధం జబ్బునుంచి లేచేసరికి ఎదిగిన కూతురుకన్నా వడ్డీతో పెరుగుతున్న అప్పే భయంకరంగా కనిపించింది. అప్పు తీర్చి కూతురు పెళ్ళి చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. చివరికి సుశీల యిలా......!

(తరువాయి 51 వ పేజీలో)

# క్షణికం

( 8 వ పేజీ తరువాయి)

ఇటువంటి పరిస్థితుల్లో రాజమ్మ బతికుంటే తనకెంతో అండగా ఉండేది. అసలు ఇటువంటి అఘాయిత్యమే జరిగేదికాదు. అతనికి గట్టిగా ఏడవాలనిపించింది. నడిబజార్లో ఎలా ఏడవటం? దిగమింగుకున్నాడు దుఃఖాన్ని.

రోడ్లన్నీ ఒంటరిగా ఉన్నాయి. జనసంచారం లేదు. ఆకాశంలో నల్లని మేఘాలు పరుగు తీస్తున్నాయి. రోడ్డుమీద లైట్లు అక్కడక్కడ గుడ్డిగా వెలుగుతున్నాయి. గుర్నాథం ఒళ్ళు సలసలా కాగిపోతున్నది. అతని ముక్కుల్లోంచి వెచ్చని శ్వాస వస్తున్నది.

తనెక్కడికి వెళ్ళుతున్నాడో అతనికే తెలియదు. వెళ్ళాలి. దూరంగా వెళ్లిపోవాలి. ఆ నరకంనుంచి దూరం కావాలి. ఆ ఘోరాన్ని తలుచుకున్నప్పుడు అతని ఒళ్ళు ఝల్లుమంటుంది.

అప్పటికే ఒకరిద్దరు "ఏమోయ్, కూతురు పెళ్లి ఎప్పుడు?" అని జాడగా అడిగారు. ఆ క్షణం అతని గుండెమీద కారం జల్లినట్లైంది. రేపు వాడే ఎదురై "కూతురికి మగపిల్లవాడా, ఆడపిల్లా?" అని అడుగుతాడు!

అతని తలమీద వేయి ఏనుగుల బరువు ఎత్తినట్లైంది. మనసంతా గందరగోళంగా ఉంది. గుండెలు బిగబట్టి నడుస్తున్నాడు.

అతని కెదురుగా ఒక కారు వస్తున్నది. జీవితంమీదా, లోకంమీదా అతనికి రోత పుట్టుకువచ్చింది. మనిషి చావడం ఎంత సేపు! కారు తప్పకుండా తనదగ్గరికే వస్తున్నది. ఒకే ఒక అడుగు, పక్కకు దొర్లితే చాలు! ఇక యీ ప్రపంచంతో, యీ బాధలతో, యీ అవమానాలతో సంబంధం ఉండదు.

కారు దగ్గరికి వస్తున్నది. నడుస్తున్నట్లు నడిచి దగ్గరికి రాగానే ఒక గంతెయ్యాలి. అంతే!

కారు మరీ దగ్గరికి వచ్చింది. సూటిగా, వాడిగా ప్రసరిస్తున్న కాంతి అతని కళ్లలో గుచ్చుకుంది. పక్కకు దూకాడు!

కారు అతనికి ఒక అడుగు దూరంలో కీచుమని పెద్ద శబ్దం చేసుకుంటూ పక్కకు తప్పుకొని వెళ్ళిపోయింది. తను చావలేదని తెలుసుకునేలోగా ఏభై అడుగుల దూరంలో కారు ఆగింది. ఒకడు పెద్దగా అరుస్తూ బయటికి వస్తున్నాడు. గుర్నాథం పక్కసందులోకి పరుగు తీశాడు. కారునుంచి దిగిన వ్యక్తి గుక్క తిప్పుకోకుండా అరుస్తున్నాడు. అతని గొంతు వెనకనుంచి ఇంకా వినిపిస్తూనే ఉంది.

నాలుగు సందులు దాటేవరకూ అతను పరుగు ఆపలేదు. తరువాత వెనక్కు తిరిగిచూసి అతగాడు వెంటపడటంలేదన్న విషయం ధృవపరుచుకొని కాస్త వేగం తగ్గించాడు.

చెమటతో అతని శరీరం ఉక్కిరిబిక్కిరవుతున్నది. రొప్పుతూ, రొజుతూ నడుస్తున్నాడు. గొంతు తడారిపోయింది. ఎదురుగా కోటేశ్వరరావుగారి సత్రం కనిపించింది. సత్రం తలుపులు మూసి ఉన్నాయి. అరుగులనిండా జనం పడుకున్నారు, చీకూ చింతా లేకుండా.

అతని పెళ్లి ఆ సత్రంలోనే జరిగింది. ఆ రోజు తన జీవితం గురించి ఎన్నో తియ్యని కలలు గన్నాడు. ఈనాటికి అవన్నీ మంచులా విడిపోయాయి.

రాజమ్మ అంత పొడగరికాదు, పొట్టికాదు. చామనచాయ. ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. కోలగా సాగిన ఆమె కళ్ళు అతని హృదయంలో గిలిగింతలు పెట్టేవి.

తన బాధ్యతలు, కష్టాలు చక్కగా అర్థం చేసుకునేది రాజమ్మ. కాపరానికి వచ్చిన కొత్తలో, ఒక్క క్షణమయినా ఆమెకు దూరంగా ఉండలేక పోయేవాడు. చుట్టాలంతా "ఏమో అనుకున్నాం. సెరజాణమ్మో! మొగుణ్ణి కొంగున ముడేసుకుంది" అని బుగ్గలు నొక్కుకున్నారు.

ఒకసారి తనకేదో కోపంవచ్చి మూడు రోజులు మాట్లాడలేదు. ఎందుకు పోట్లాడేనా అని లోపల పీకుతున్నా, పైకి బింకంగానే ఉన్నాడు. ఆ మూడు రోజులూ చక్కగా ముస్తాబై ఆ గదిలోంచి యీ గదిలోకి, యీ గదిలోంచి ఆ గదిలోకి తిరిగేది. తను మొహం పక్కకు తిప్పి కూచున్నప్పుడు వెనకనుంచి వచ్చి గూట్లోంచి ఏదో తీస్తున్నట్లు రాసుకుంటూ వెళ్లేది. ఆ రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు.

రాజమ్మ అతని జీవితంలో మెరుపులా వచ్చింది. కమ్మని అనుభవాలను, తియ్యని స్మృతులను యిచ్చి మెరుపులా మాయమైపోయింది.

ఎవడో అతని దగ్గరికి వచ్చి మొహం దగ్గర మొహంపెట్టి పరీక్షగా చూసి వెళ్లిపోయాడు. వాడి బొడ్లో ఉన్నది 'సరుకు' సీసాలనీ, వాడొక మొబైల్ డ్రగ్ హౌసనీ, పాత ఖాతాదార్లకోసం వెతుకుతున్నాడనీ అతనికెలా తెలుస్తుంది! వాడి రాకతో అతని ఊహాప్రపంచం చెదిరిపోయింది.

ఎప్పుడూ మనిషి ఊహాప్రపంచంలోనే ఉండిపోతే ఎంత బాగుంటుంది! ఆ ప్రపంచంలో కష్టాలకు స్థలం లేదు. విధి ఆటలేం సాగవు. తనకు తనే చక్రవర్తి! నియంత! ఎవరికీ నోరు విప్పే ధైర్యం ఉండదు. తన తోటి గుమాస్తా జోగయ్యచేత గోడకుర్చీ వేయిస్తాడు. హెడ్ గుమాస్తాకు ఉదయం తొమ్మిదినుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జైలు! హుజూర్ సిరస్తాదారుకు యావజ్జీవ కారాగారం! కలెక్టరుకు ద్వీపాంతరవాసం! తనకో చిన్న ఉద్యానవనం. తిండికి బట్టకు లోటులేని జీవితం. తన సుశీలకు......?

ఎవరో బలంగా అతని తలమీద మొట్టినట్లైంది. భూకంపంమీద నడుస్తున్నట్లు కాళ్ళు వణికాయి. ఎదురుగా లేడీడాక్టర్ కనకవల్లి ఇంటిముందున్న ఎర్రని సైన్‌బోర్డు కొరివి దయ్యంలా కనిపించింది. ఆకాశంలో పెద్ద


కేవలం మాటలతో
కాకుండా
చేతలతో
మీ దేశభక్తిని
నిరూపించుకోండి



దగ్గు నివారిణి తిరగబెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు. 157-15. ట్రయల్ 12—13.

చెవుడు పూర్తి కోర్సుద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147-15. ట్రయల్ రు 17-97 న.పై.

కంటిలోని పొర పక్వమైనా, కాకపోయినా, ఆపరేషన్ లేకుండా రు. 87-97 న.పై.లకు తప్పక నయం చేయబడును.

జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.

DR. SHERMAN, F.C.S.
181, R. N. Guha Road, Calcutta-28.



ఆటోమాటిక్ బాటరీ ఫాన్
రు. 8/— లకు



జపాన్‌చే కొత్తగా కనిపెట్టబడినది

వేసవిలో చల్లటిగాలి నానందించండి. ఇంటా, బయటా ఉపయోగిస్తుంది. దీన్ని ఆఫీసులో, ఫ్యాక్టరీలో, సినిమాలో, ట్రెయినులో, బస్సులో, కారులో ఎక్కడైనా, ఎప్పుడైనా వాడవచ్చును. బాటరీతో ఆపరేట్ చేయబడునది. నిజంగా జీవితపర్యంతం పని చేస్తుంది. శక్తివంతమైనది, కాని పూర్తిగ భద్రమైనది. తేలికైనది, నిశ్శబ్దమైనది. ఖర్చులేనిది, వాడటానికి సర్వసిద్ధంగా పంపబడుతుంది. మావద్ద మాత్రమే లభిస్తుంది. పరిమితమైన స్టాకులు. వెల రు. 8/—, పోస్టేజీ రు. 1/50. మీ ఆర్డరును నేడే పంపండి.

JAPAN TRADING AGENCY,
2194-Kalyan Pura, DELHI-6.
—PRATAP—

మెరుపు మెరిసింది. అతని కళ్ళు జిగేలుమన్నాయి.

పోయి లేడీడాక్టర్ని తీసుకెళ్ళాలని అతని మనసు పరితపించింది. మళ్ళీ భూమి అదిరి పోయేటట్టు గట్టిగా ఉరిమింది ఆకాశం. అతని గుండె దడదడలాడింది. సుశీల ఒక్కర్తే ఆ తప్పుకు బాధ్యురాలు కాదు. ఆమెతోపాటు మరో పురుషుడికీ అందులో భాగం ఉంది.

"అయినా ఆమాత్రం జ్ఞానం ఉండక్కర్లా? మంచీ, చెడూ తెలుసుకోలేని పశువా అది?" అతని గుండె కోపంతో మండిపోయింది. గిరుక్కున వెనక్కు తిరిగి మళ్ళీ నడవసాగాడు.

సన్నని తుంపర ఆరంభమైంది. రాబోయే వర్షాన్ని సూచిస్తూ ఆకాశం గర్జిస్తున్నది. మెరుపులు వేయి గుర్రాల వేగంతో పరుగు తీస్తున్నాయి. అతని చుట్టూ ఉన్న ప్రపంచం ఊగుతూ ఉంది. అతని శరీరం తూలిపోతున్నది. ఎదురుగా ఉన్న మంగపతిగారి మేడకూడా ఊగుతున్నది.

నాలుగు వేలు అప్పిచ్చి, గడువులోగా చెల్లించలేదని మేడ అపహరించాడు మంగపతి. అయినా ఏం బాగుపడ్డాడు? మేడ కొన్న పాతని, మరమ్మతు చేయించి కాపరం పెట్టాలని ఆశపడ్డాడు. మరమ్మతు ఆరంభించిన రోజే హఠాత్తుగా చనిపోయాడు. బిడ్డా పాపా లేరు. అతని వంశం అంతరించి పోయింది. ఇక ఆ మేడ అలాగే వదిలేశారు. అందులో కాపరం ఉండేందుకు ఎవరికీ మనసు ఒప్పలేదు. ప్రస్తుతం గబ్బిలాలు నివాసం

# క్షణికం

ఏర్పరుచుకున్నాయి అందులో.

మూదుల్లాంటి చినుకులు దబదబా బాదాయి. గుర్నాథం రెండు అంగల్లో మంగపతి మేడలోకి వెళ్ళాడు. ముందు భాగంలో ఉన్న పెంకులన్నీ ఏనాడో ఎగిరిపోయాయి. అక్కడా వర్షం కురుస్తున్నది. లోపలికి వెళ్ళాడు. కాళ్ళక్రింద ఏదో మెత్తగా తగిలి కెవ్వుమన్నాను. గాబాల చప్పుడు వినిపించింది. ఒక స్పర్శ అప్పటివరకూ ఆవేశంతో మరిగిపోతున్న అతని శరీరాన్ని చల్లగా తాకింది. అతని హృదయంలో అర్థంకాని ఉద్వేగం తొక్కిసలాడింది.

బయట వాన జలజలా కురుస్తున్నది, కమ్మని సంగీతంలా! చల్లని గాలి హాయిగా శరీరాన్ని తాకుతున్నది.

ఆకాశంలో మేఘాలు ఢీకొంటున్నాయి. ప్రకృతి ఏదో చోద్యం చూస్తున్నట్లు, సంతోషం పట్టలేక గంతులు వేస్తూ బాణాసంచా కాలుస్తున్నట్లు ఆర్భాటం చేస్తున్నది. ఒక మేఘం తనలోకి లాక్కుంటున్నట్లు చంద్రుణ్ణి దగ్గరికి తీసుకుంది. నిస్సహాయంగా, నిస్పృత్తంగా చంద్రుడు మేఘాల ఒడిలో దాగిపోయాడు.

ఆ వర్షానికి భూమినుంచి వెచ్చని, కమ్మని పరిమళాలు లేస్తున్నాయి.

గుర్నాథం ప్రకృతి గర్భంనుంచి, విధి తలుపునుంచి బయటపడినట్లు వర్షంలోకి వచ్చాడు. అతని కాళ్ళు తేలిపోతున్నాయి. తల గిర్రున తిరిగిపోతున్నది.

శరీరం పూర్తిగా తడిసిపోయింది. కుండపోతగా కురుస్తున్న వర్షం అతని పాపాలను కడిగేస్తున్నట్లు అభిషేకం చేస్తున్నది.

క్షణక్షణం ఆకాశం పంపుతున్న మెరుపుల్లో దూరంగా ఉన్న లేడీడాక్టర్ కనకవల్లి యింటి ముందున్న సైన్‌బోర్డు జ్ఞానజ్యోతిలా కనిపించింది.

బయటి ప్రపంచానికి తన బాధ వినిపించకుండా లోలోపల అణుచుకుంటున్న సుశీల మూగ వేదన అతని చెవుల్లో ప్రళయంలా ధ్వనించింది.

ఇప్పుడు తనుమాత్రం చేసిందేమిటి! "దానికీ తండ్రి బుద్ధులే అబ్బినై." రాజమ్మ మాటలు గుర్తు వచ్చాయి.

లేడీడాక్టర్ యింటివేపే నడవబోయాడు. మళ్ళీ అతని మనసొప్పలేదు. "నేను ఎంతచెడినా మొగవాణ్ణి; లక్ష చేస్తాను. ఆడది చెయ్యొచ్చా!" తరతరాలనుంచి గూడుకట్టుకున్న మగతనం ఆక్రోశించింది అతనిలో.

వెనక్కు తిరిగి రెండు అడుగులు వేశాడో లేదో కాలు జారి కుప్పలా కూలిపోయాడు.

లేవటానికి ప్రయత్నించాడు. ఒక కాలు కదల్లేదు. మరోసారి ప్రయత్నించాడు. ఒక చెయ్యి కదల్లేదు. గట్టిగా అరిచాడు. గొంతు పెగల్లేదు.

మరోసారి శక్తివంతా ఉపయోగించి లేవబోయాడు.

అతని కాలు కదల్లేదు!

చెయ్యి కదల్లేదు!

గొంతు వినిపించలేదు! అతనికి అయిదు సంవత్సరాలకు పూర్వం వచ్చిన వ్యాధి జ్ఞాపకం వచ్చింది.

ఆ రాళ్ళవర్షంలో అక్కడే మిగిలిపోయాడు, జారిన కన్నీటి బిందువులా; రాలిన నక్షత్రంలా.

• • •

తెల్లవారింది తెల్లగా, చల్లగా.

"విన్నావా?" అన్నాడు ముసుగు పెట్టుకొని లోపలికి వస్తున్న చలమయ్య.

అప్పుడే పెసరట్టు పళ్ళెంలో వేసుకుని, రెండు ముక్కలు తుంచి నోట్లో కుక్కుకున్న లలితాంబ సమాధానం చెప్పలేక, మింగలేక సలక మార్చుకుంది.

"గుర్నాథం నడిరోడ్డుమీద కుక్కచావు చచ్చేడట."

"పోయేడూ!" అంది మంచినీళ్ళు తాగి.

పెనంమీద పెసరట్లు తిప్పుతున్న రాజ్యలక్ష్మి "పాపం!" అంది.

"ఆ పిల్లముండకూడా కుక్కిన పేనల్లే మంచంలోనే చచ్చూరుకుంది." చలమయ్య ఖాళీపళ్ళెం ముందుకు లాక్కుంటూ పీటమీద కూచున్నాడు.

"తెలివితక్కువ దద్దమ్మ కాకపోతే యింత దానికి యిలా ప్రాణాలు తీసుకుంటారా! ఇలాంటివి లోకంలో ఎందరిళ్లల్లో జరగటంలేదు? ఎవడో ఒవాణ్ణి లాక్కొచ్చి ఆ మూడుముళ్లూ వేయించి పెళ్లి అయింది అనిపిస్తే చిక్కొదిలి పోయేదికదు!" కసిగా ఒక పెసరట్టు ఉండలా చుట్టి నోట్లో కుక్కుకుంది లలితాంబ.

"ఎవడొస్తాడే అంత తేరగా?" అన్నాడు ఖాళీ పళ్ళెంవేపు చూస్తూ చలమయ్య.

"ఎవడో తలమాసిన వెధవ. ఏం, మనం తీసుకురాలా రాజ్యలక్ష్మికి?"

దంపతులిద్దరూ ఓరగా నవ్వుకున్నారు.

పెనం దగ్గర నిల్చున్న రాజ్యలక్ష్మి ఏం చెయ్యాలో తోచక అట్లకాడ అవతలివేపు పట్టుకొని చెయ్యి చుర్రున కాల్చుకుంది. ★


కలం స్నేహితులు కావాలా?

ఒంటరిగానున్న మీకు దేశ విదేశాలలోని స్త్రీ పురుషులతో మిత్రత్వము ఏర్పరచి, వివాహ, వ్యాపార, విద్యా ఆర్థిక, నిరుద్యోగ విషయాలలో సహాయం చేసేందుకు స్థాపించిన మా స్నేహమంజరిలో సభ్యులుగా జేరండి. నేడే 15 న. పై. స్టాంపు పంపుతూ, వివరములకు వ్రాయండి.

స్నేహమంజరి
ఈడేపల్లి, మచిలీపట్నం (ఆంధ్రప్రదేశ్)

లాభదాయకమైన లఘుపరిశ్రమ ప్రారంభించండి

"అధునాతన కుటీరపరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలలో ఉన్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమనుగూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడిపదార్థాలు లభించేచోట్లు, ముడి పదార్థాల కొనుగోలుకు, వాయిదాల పద్ధతిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం—ఇందులో ఉన్నాయి. లఘుపరిశ్రమలు ప్రారంభించ దలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగినపరిష్కార మార్గాలు ఇందులో ఉన్నాయి. పుటలు 878, సుమారు 300 బొమ్మలు, ధర రూ. 13. తపాలా రుసుం రూ. 1—61. ఫోన్ నం: 229835.

COTTAGE INDUSTRY, (AWN-21) P.B 1262, Jamuna Road Delhi-6.